
కథ

# ఎగురలేని పక్షి

## – కొమూరి కోటేశ్వరరావు



టిక్... టక్...టక్ మని తనవైపుగా నడుచుకుంటూ వస్తున్న బూట్ల శబ్దం వినబడటంతో మోకాళ్లలో తల పెట్టుకొని కుంగిపోతూ రోదిస్తున్న స్వరణి తలెత్తి చూసింది. ఎదురుగా కానిస్టేబుల్. ఒక చేతిలో భోజనం పళ్లెం, మరో చేతిలో మంచినీళ్ల సీసా వుంది. సెల్ ఓపెన్ చేసి వాటిని ఆమె ముందుంచి వెళుతూ 'రేపు నిమ్మల్ని కోర్టులో హాజరు పరుస్తారు. శిక్ష పడవచ్చు లేదా మొదటి తప్పుగా భావించి ఫైన్ వేసి వదలి వేయవచ్చు' తనకి తెలిసింది చెప్తకొంటూ సెల్‌కు తాళం బిగించి వెళ్లిపోయాడు.

కానిస్టేబుల్ తెచ్చిన భోజనం తినబుద్ధి కాలేదు. అరెస్ట్ అయి నాలుగు గంటలైంది. కానిస్టేబుల్ చెప్పిన మాటలు విన్న ఆమెకు భయమేసింది. రేపు సిటీ మధ్యలో జనంతో కిక్కిరిసిన కోర్టులో నిలబడాలన్న మాట. పరువు–ప్రతిష్టలు కలిగిన కుటుంబంలో పుట్టి తనెవరో సమాజానికి తెలియకుండా పెరిగి నేడు చేయని తప్పుకు అపరాధినై... మాన మర్యాదలు మంట కలిసి పోతున్నాయి. తన వల్ల తల్లిదండ్రులు గురవబోతున్న మనో వేదనను తలచుకుంటేనే కళ్లనీళ్లు తిరుగుతున్నాయి.

సిటీలో పెద్ద పేరున్న పారిశ్రామిక వేత్తల్లో ఒకరు తన తండ్రి. నగరం లోనే పేరుమోసిన సంఘ సేవిక తన తల్లి. అంతటి పేరు ప్రఖ్యాతలున్న వారి వారసురాలినైన తను... తలుచుకుంటేనే శరీరం వణికి పోతోంది. స్వరణిలో తెలియని భయం నెలకొంది. తనకు జరిగిన దానికి ఖిన్నురాలై జీవితం పైనే ఎక్కడలేని నైరాశ్యతను పెంచుకొంది.

రాత్రి పదకొండవుతున్నా మదిలో నెలకొన్న ఆలోచనలు మైకం కమ్మేస్తున్నాయి. రోజూ పదింటికే దుప్పటి తన్నేసి నిద్రపోయే తను నేడు తన విధి రాతను తలుచుకొని తపించి తపించి విలపిస్తోంది.

శీతా కాలం కావటంతో చలి కూడా చిన్నగా మొదలైంది. గదిలో లైట్లు ఆర్పివేసి మూలగా నున్న బెంచీలపై నిద్ర కునుకుతున్నారు సెంట్రీ డ్యూటీలో వున్న ఇద్దరు కానిస్టేబుళ్లు. వీరి దేశ భక్తి మండిపోను యువతి నన్న గౌరవం కూడా లేకుండా లైట్లను తీసివేయడాన్ని అంతటి మనో వ్యధలోను వారిని కక్షగా తిట్టుకుంది. రోజూ ఏర్ కండిషన్డ్ గదిలో పడుకొనే తను, తనున్న జైలు గదిలో ఫ్యాను కూడా లేదు. దోమల బాధ భరించలేనిదిగా వుంది. వాటన్నింటి కన్నా తనున్న పరిస్థితిని తలుచుకొని మదనపడుతూ తన ఎదురుగా కిటికీ నుంచి ప్రకాశిస్తున్న కార్తీక పౌర్ణమి చంద్రుణ్ణి చూస్తూ 'ఎంత నిర్మలంగా, ప్రశాంతంగా వెలుగుతున్నాడు. అంతటి ప్రశాంతంగా గడిచిన తన జీవితం... గడచిన సంఘటనలు మళ్లీ మళ్లీ జ్ఞాపకానికొస్తున్నాయి.

* ** ** *

ఉదయం ఎనిమిది గంటలైంది.

స్వరణీ... స్వరణీ... తల్లి పిలుపుతో మేల్కొన్న స్వరణి తన గదిలో ఏ.సి. ఆపుచేస్తూ పిలుస్తున్న వైపు చూసి మమ్మీ... టుడే హాలిడే... ఈనాడు కూడా రెస్ట్ లేదా బుంగమూతి పెట్టి ఎక్కడలేని అమాయకత్వాన్ని ఒలకబోస్తూ ప్రశ్నించింది.

'చూడమ్మా స్వరణీ! మనం ఎంత కష్టపడుతున్నామన్నది ముఖ్యం కాదు, తెల్లవారి ఐదింటికి నిద్రలేచి మహాలక్ష్మిలా నిత్యం కళకళలాడుతుండాలి. నాన్న గారు వ్యాపార లావాదేవీల్లో ఎంత తీరిక లేకున్నా క్రమ శిక్షణకు అత్యంత విలువనిస్తారు. నేను ఎంత సంఘ సేవ చేస్తున్నా మన కుటుంబ సంప్రదాయానికి విఘాతం కలిగించలేదు. నీ చదువు సంధ్యలూ, సరదా...సందళ్లతో ఎంతటి ఆనంద అనుభూతులైనా పొందు, అవేవీ మన కుటుంబ ప్రతిష్టలు దిగజార్చని విధంగా, సమాజంలో గౌరవాన్ని పెంచే విధంగా వుండాలి. మనం చేస్తున్న కార్యక్రమాల పట్ల విశ్వాసం, మనకున్న దాంట్లో పదిమందికి సహకరించడంలో వుండే ఆనందం, తృప్తి మరి దేంట్లోను లభించదు. కాబట్టి నువ్వుకూడా నాలాగానే గడపాలని కోరిక' అని చెప్పింది. ఈ రోజు నాన్న గారు వరద బాధితుల సహాయార్థం రెండు లక్షలు విరాళం యిచ్చి ఉదయమే ఢిల్లీ వెళ్లిపోయారు. వరద బాధితుల వస్తు సేకరణ, వాటి పంపిణీ కార్యక్రమాల పనిపై నేను వెళుతున్నాను. ఈనాడు ఇంటికొచ్చే గెస్ట్‌లతో మాట్లాడి పంపాల్సిన బాధ్యత నీదేనంటూ' స్వరణికి హితబోధ చేసి ఆమె తల్లి వెళ్లిపోయింది.

ఉదయం నుంచీ గెస్ట్‌ల రాకపోకలు, వారికి మర్యాదలు చేయడం తదితరాలతో అలసిపోయిన స్వరణి విశ్రాంతి కోసం సోఫాలో కూలబడిందో లేదో వెంటనే ట్రింగ్... ట్రింగ్...ట్రింగ్ మంటూ ఫోన్ మోగడంతో అసహనంగా లేచి వెళ్లి రిసీవర్ అందుకొని 'హలో...' అంది.

'హాయి స్వరూ... నేను యువర్స్...' ఏదో చెప్పేంతలోనే అవతలి వ్యక్తి గొంతును గుర్తించిన స్వరణి 'హాయ్... కుశవ్...ప్...ప్...ప్... రిసీవర్ లోనే తన వాడిగా భావించింది.

'అబ్బ! ఎంత మధురంగా వున్నాయి నీ తియ్యటి ముద్దులు స్వరూ...! ఆ రిసీవర్‌కు ఎంతటి అదృష్టం! నాకూ అంతటి భాగ్యం పొందాలని వుంది'– కుశవ్ అన్నాడు.

'అబ్బాయి గారికి ఎంతటి ఆశ' కొంటెగా అంది స్వరణి.

'స్వరూ ఈ సాయంత్రం ఆరింటికి ఇందిరా పార్కులో కలుద్దాం. ఇంపార్టెంట్ సబ్జెక్ట్ చర్చించాలి. తప్పక రావాలి స్వరూ...' ఆదేశించినట్లుగా మాట్లాడుతున్నా, తను రాదేమోనన్న భయం కూడా వుండటం వల్ల ఆ మాటల్లోనే లాలనగా బతిమాలుతున్న ధోరణి గమనించి మురిసిపోతూ 'లేదు కుశవ్! మమ్మీ, డాడి ఇద్దరూ ఇంటి వద్ద లేరు. అంత అవసరమైతే నీవే ఇక్కడికి రా...' అంది స్వరణి.

'అమ్మో! అంత ధైర్యమే! సాహసం చేయలేని డింభకుణ్ణి! తప్పదు స్వరూ... నీవే రావాలి. నీ కోసం ఎదురు చూస్తు వుంటా. మరిక మాటల్లేవ్' అంటూ రిసీవర్ పెట్టేశాడు. తప్పించుకునే అవకాశం లేక పార్కుకు వెళ్లడానికి నిశ్చయించుకుంది స్వరణి.



కుశవ్ రెండేళ్ల క్రితమే పరిచయమయ్యాడు. కాలేజీ ఫ్రెండ్స్ కావడంతో పరిచయం కాస్తా ప్రేమగా మారి పార్కులు, సినిమాలు షికార్లు వరకు వచ్చింది.

అన్న మాట ప్రకారం చెప్పిన టైమ్ కన్నా పది హేను నిమిషాల ముందే పార్కుకు చేరింది స్వరణి.

పార్కులో చెట్టూ, పుట్టా పూపొదల చాటున ఎక్కడ చూసినా ప్రేమ జంటలే కనిపిస్తున్నాయి. పార్కంతా కలియ తిరిగినా కుశవ్ రాలేదు. ఆకాశం మేఘావృతమైంది. సన్నటి చినుకులు ప్రారంభమయ్యాయి. అప్పటి వరకు విహారంలో వున్న ప్రేమ జంటలు ఒక్కొక్కరూ తమ తమ ప్రాంతాలకు అసహనంగా విరహ వేదనతో, జగమే విడిపోతున్నంత వ్యధతో వెళ్లసాగారు.

మసక చీకట్లు అలుముకున్నాయి. అసహనం పెరిగిపోతోంది స్వరణికి.' స్వరణి' అన్న పిలుపుతో గుంభనంగా వున్న ఆమె ఒక్కసారిగా ఆనంద పరవశంతో కుశవ్ వచ్చాడని వేగంగా వెనుతిరిగి చూసింది. ఎదురుగా తన వైపే వస్తున్న రమణ తేజ కనిపించాడు. ఉప్పొంగి వచ్చిన ఆనందం కాస్తా నీరుకారిపోయింది. యూనివర్శిటీలో చేరిన కొత్తల్లో పరిచయమైన రమణ తేజ- మంచి వ్యక్తి, స్నేహశీలి. అన్నింటి కన్నా మృదు స్వభావి.

'హలో రమణ!' చిరునవ్వుతో పలకరించింది స్వరణి

'ఎవరి రాక కోసమో ఎదురుచూస్తున్నట్లున్నావ్'

'కుశవ్...'

'హో... యువర్స్ బాయ్ ఫ్రెండ్...!'

అవునన్నట్లుగా తలూపుతూ మీరిలా? ప్రశ్నార్థకంగా ముఖం పెట్టి చూస్తున్న స్వరణిని చూస్తూ తనే కల్పించుకుని 'యేదో కాలక్షేపం కోసం వచ్చాను. నా రాకా, వాన రాకా రెండూ ఒకే సారి జరిగాయి. ఇక చేసేది లేక తిరిగి వెళుతుంటే మీ దర్శనమైంది. పలకరించి వెళదామని... మరిక వెళ్లిరానా?' అక్కడి నుంచి వెళ్లే ప్రయత్నంలో అన్నాడు రమణ తేజ.

'ఈ పాటికే కుశవ్ రావాలి. వుండండి తేజ. కుశవ్ రాగానే మీకు పరిచయం చేస్తాను. తనే చొరవ తీసుకుని అలా కూర్చుందాం రండి' అంటూ వర్షం పడని ఓ పూల చెట్టు వద్దకు దారి తీసింది స్వరణి. సహజంగా మొహమాటస్తుడు కావడంతో కాదనలేక ఆమెను అనుసరించాడు రమణ తేజ.

'టైమ్ ఏడైంది స్వరణి! కుశవ్ వచ్చేలా లేడు, మనం బయలు దేరితే మంచిదేమో? వర్షం కూడా క్రమేణ పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి–' అంటూ రమణ తేజ లేచే ప్రయత్నం చేయసాగాడు.

సరిగ్గా అప్పుడు జరిగిందా సంఘటన. ప్రశాంతంగా వున్న పార్కు మహిళల కేకలు, అరుపులతో దద్దరిల్లిపోయింది. ఒక్క సారిగా ఉలిక్కిపడ్డారిద్దరూ. వర్షం రాకతో వెళ్లిపోయిన ప్రేమికుల స్థానంలో రాత్రి వేళ కావడం వల్ల కిరాయి ప్రేమ జంటలు కొలువుదీరాయక్కడ. ఎవరో అందించిన సమాచారం మేరకు పోలీసులు పార్కులో ప్రవేశించి రైడింగ్ చేశారు.

'సార్! మేము ఫ్రెండ్సమండీ!.... విహారానికని వస్తే...' వారి మాటలు పోలీసుల చెవికెక్కలేదు. 'విరహానికో... విహారానికో... పట్టుబడిన ప్రతి ఒక్కరూ ఇలాగే చెప్తేది. రేయ్! వారితో పాటు వీరిని కూడా వ్యాన్ ఎక్కించండి–' ఎస్.ఐ. గర్జనతో వణికిపోయిన స్వరణి, రమణలు ఎంత ప్రాధేయపడి గింజుకున్నా, కాళ్లా వేళ్లా పడినా ఫలితం శూన్యమైంది. కిరాయి జంటలతో పాటు పోలీసులు వారిద్దరిని కూడా వ్యాన్ ఎక్కించారు. ట్రాఫిక్ జామ్‌తో ఆలశ్యంగా పార్కులోకి అడుగు పెట్టిన కుశవ్ అందరితో పాటు అపరిచిత వ్యక్తితో స్వరణి వ్యాన్‌లో వున్న దృశ్యాన్ని చూడడంతోనే చలించిపోయాడు.

దూరం నుంచి తననే చూస్తూ నిలబడి వున్న కుశవ్‌ను చూసిన స్వరణి 'కుశవ్... కుశవ్... కుశవ్...' అంటూ చెమ్మగిల్లిన కన్నీటితో, విషాదం నిండిన గొంతుతో ఎంతగా అరిచినప్పటికీ ఆమె ఆర్తనాదాలు అతణ్ణి చలింపజేయలేక పోయాయి.

తనిప్పుడు ఎవరితో ఏమీ మాట్లాడ లేకపోతోంది. తన గురించి చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. తల్లిదండ్రులు యిచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేయడమే కాక, ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన వ్యక్తిని నమ్మించలేని స్థితికి చేరుకుంది. కుశవ్ ఇప్పుడు ఏ కోశాన తన మనస్సులో లేడు. తన ముందుంది తల్లిదండ్రుల పరువు ప్రతిష్టలు. వారికెలా తను చేసిన తప్పును, చూస్తున్న నిజం కాని వాస్తవాలను చెప్పి నమ్మించగలదు. తనిప్పుడు ఎగురలేని పక్షి లా జీవితం అనే ఖైదులో బంధీ అయింది.

పోలీస్ స్టేషన్‌లో ఆరిన విద్యుత్ దీపాలు ఒక్కసారిగా వెలగడంతో ఉలిక్కిపడ్డ స్వరణి తల తిప్పి చూసింది. సెల్‌ను ఓపెన్ చేస్తున్న పోలీసులు, ఎదురుగా తల్లిదండ్రులు, ఇతర పోలీస్ అధికారులు. వారినందరిని చూడగానే స్వరణి నివ్వెరపోయిం బోరున విలపిస్తూ అంతటి నీరసంలోను వేగంగా వెళ్లి తల్లిని కౌగలించుకుంది.